ప్రజాశక్తి
ఆదివారం 2 ఏప్రిల్ 2023 5 అనంతపురం

మెరుగైన వైద్యసేవలు అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా వైద్యశాఖ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం నాడు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయ సమావేశ భవనంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ కార్యక్రమాన్ని మరింతగా ప్రజలకు చేరువ చేయాలన్నారు. గర్భిణులు, అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర్నుంచి వారికి అందించే టీకాల ప్రక్రియను క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. సంక్రమిత - అసంక్రమిత వ్యాధుల సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాలు వాటి పురోగతిపై జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా॥యుగంధర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి, డిసిహెచ్ఎస్ డా॥కష్ణవేణి, జిల్లా ప్రోగ్రాం అధికారులు డా॥సుజాత, డా॥చెన్నకేశవులు, డా॥నారాయణ స్వామి పాల్గొన్నారు.

రాష్ట్రంలో భారాల పాలన

◆ యువగళంలో నారా లోకేష్ ◆ 57వ రోజు ధర్మవరంలో కొనసాగిన పాదయాత్ర

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రంలో ప్రజలపై అనేక భారాలను మోపుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని టిడిపి జాతీయ కార్యదర్శి నారాలోకేష్ పేర్కొన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర 57వ రోజు శనివారం నాడు ధర్మవరం సమీపంలోని ప్యాదిండి ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైంది. మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్, పరిటాల సిద్దార్థతో కలిసి లోకేష్ పాదయాత్ర చేశారు. చెన్నేకొత్తపల్లి మండలం చందమూరు విడిది కేంద్రం నుంచి ధర్మవరం పట్టణ సమీపంలోని మార్కెట్ యార్డ్ వరకు 15 కిలోమీటర్ల మేర శనివారం పాదయాత్ర సాగింది. ప్యాదిండి ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి ప్రారంభమైన పాదయాత్ర ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డికాలనీ, ఇందిరమ్మ, వైఎస్ఆర్ కాలనీ, లక్ష్మీచెన్నకేశవపురం, సాయినగర్, ఆర్టీసీబస్టాండ్, కాలేజ్, కళాజ్యోతి, ఎన్టీఆర్ సర్కిళ్లు మీదుగా అంజుమన్, తేరు కూడిలి, కదిరి గేటు నుంచి మార్కెట్‌యార్డు వరకు కొనసాగింది. ప్యాదిండి ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రాగానే పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు భారీ స్వాగతం పలికారు. గజమాలలు వేసి ఆహ్వానించారు. ఆయా ప్రాంతాల్లో అడుగడుగునా నారా లోకేష్‌కు టిడిపి అభిమానులు ఘనస్వాగతం పలికారు. పాదయాత్ర సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రావడం లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయ్నారు. ప్రజలపై పన్నుల భారాలు వేసి నడ్డివిరుస్తున్నారన్నారు. వైసిపి పాలనలో మైనార్టీలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు కావడం లేదన్నారు. జగన్ ఒక కట్టింగ్ అండ్ ఫిట్టింగ్ మాస్టర్ అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర సరుకుల ధరలు, పన్నుల భారాన్ని తగ్గిస్తామన్నారు. యువతకు స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, సవితమ్మ, కర్నూల్ జిల్లా పత్తికొండ టీడీపీ ఇన్‌ఛార్జి కేఈ శ్యాంబాబు, మదమంచి స్వరూప, అంబికా లక్ష్మీనారాయణ, గోనుగుంట్ల విజయకుమార్, ఎల్.నారాయణచౌదరి, ఎల్.నరేంద్రచౌదరి, రంగయ్య, రామ్మూర్తి నాయుడు, చింతలపల్లిమహేశ్ చౌదరి, కమతంకాటమయ్య, ఫణికుమార్, భీమనేని ప్రసాదనాయుడు పాల్గొన్నారు.

వినతులు... విజ్ఞాపనలు..

లోకేష్ పాదయాత్రలో పలువురు సమస్యలపై ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వ గహాల నిర్మాణం కోసం తమ భూములను సేకరించి పేదలకు ఇళ్లపట్టాలు పంపిణీచేశారని, అయితే భూయజమానులకు గత ప్రభుత్వంలో ఇంటిపట్టాలు మంజూరు చేయగా ఈప్రభుత్వం వచ్చిన తరువాత రద్దుచేసిం దని మండల పరిదిలోని పోతులనాగేపల్లికి చెందిన పలువురు రైతులు నారా లోకేష్‌కు విన్నవించారు. గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసిన అర్హులైన పేదలకు తిరిగి పట్టాలు ఇప్పించాలని కోరారు. ఆయన స్పందిస్తూ టీడీపీ ప్రభుత్వం రాగానే అర్హులందరికి ఇంటిపట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా శ్రీకష్ణదేవరాయ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా ప్రభుత్వం నిర్వహించే విధంగా చట్టం తీసుకురావాలని కాపు కార్పోరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు, ధర్మవరంలో బలిజ భవనానికి స్థలం కేటాయించాలనే తదితర సమస్యలపై బలిజ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని టిడిపి వడ్డెర సంఘం నాయకులు పల్లపు రవీంద్ర ఆధ్వర్యంలో లోకేష్‌ను కోరారు. స్వర్ణకారులకు బీమా సౌకర్యం కల్పించాలని స్వర్ణకారులు వినతిపత్రం అందించారు.

నారా లోకేష్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న ధర్మవరం టిడిపి శ్రేణులు

పసుపునీళ్లతో స్వాగతం

యువగళం పాదయాత్ర పట్టణంలోకి ప్రవేశించగానే 25వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి భీమనేని ప్రసాదానాయుడు ప్రత్యేక అభిమానంతో స్వాగతం పలికారు. ట్యాంకర్‌ను ఏర్పాటుచేసి పసుపునీళ్లతో లోకేష్‌కు స్వాగతం పలికారు. ప్యాదిండి ఆంజనేయస్వామి గుడి నుంచి పట్టణంలోని షిర్డీసాయి బాబా గుడి వరకు 6 కిలోమీటర్ల మేర పసుపునీళ్లతో నేలను తడుపుతూ స్వాగతం పలికారు.

పురపాలక ఆదాయం 73.44 శాతం

◆ రూ.75.97 కోట్లు ఆస్తిపన్ను చెల్లింపు

◆ గతేడాది కంటే 34.41 శాతం పన్నును చెల్లించిన పురపాలక ప్రజలు

◆ జిల్లాలో తాడిపత్రి టాప్ ◆ 'అనంత' రాష్ట్రంలో మూడవ స్థానం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పురపాలక సంఘం ఆస్తి పన్ను ద్వారా ఆదాయం లక్ష్యంలో 73.44 శాతం సాధించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అనంతపురం నగర పాలక సంస్థతోపాటు ఏడు పురపాలక సంఘాలు కలిపి మొత్తం 103.45 కోట్లు ఆస్తి పన్ను ద్వారా లక్ష్యంకాగా రూ.75.97 కోట్లు వచ్చింది. 73.44 శాతం ఆదాయం వచ్చింది. అంతకు మునుపు ఏడాది అంటే 2021-22 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఏడు పురపాలక సంఘాలు కలిపి రూ.56.52 కోట్లు ఆస్తి పన్నును పురపాలక ప్రజలు చెల్లించారు. ఈ ఏడాది అది రూ.75.97 కోట్లు చెల్లించారు. గతేడాది కంటే 34.41 శాతం అధికంగా ఆదాయం వచ్చింది. అన్నింటిలోకి తాడిపత్రి అగ్రభాగాన జిల్లాలో ఉంది. నగర పాలక సంస్థల్లో రాష్ట్రంలోనే అనంతపురం నగర పాలక సంస్థ మూడవ స్థానంలో ఉంది.

జిల్లాలో తాడిపత్రి టాప్

అనంతపురం జిల్లా పరిధిలో ఏడు పురపాలక సంఘాల్లో తాడిపత్రి పురపాలక సంఘం ఆదాయం టాప్ ఉంది. తాడిపత్రి పురపాలక సంఘం ఆస్తి పన్ను లక్ష్యం రూ.8.98 కోట్లు కాగా 7.96 కోట్లు వచ్చింది. 88.60 శాతం ఆదాయం వచ్చింది. అనంతపురం నగర పాలక సంస్థలో రూ.60.11 కోట్లుకాగా రూ.48.43 కోట్లు అంటే 80.60 శాతం ఆదాయం వచ్చింది. గుత్తి పురపాలక సంఘంలో రూ.4.83 కోట్లుకాగా రూ.3.39 కోట్లు 70.20 శాతం పన్నులు వసూళ్ల అయ్యాయి. గుంతకల్లు పురపాలక సంఘం రూ.15.02 కోట్లకుగానూ రూ.10.03 కోట్లుకాగా 66.80 శాతం ఆదాయం వచ్చింది. రాయదుర్గం పురపాలక సంఘంలో రూ.4.87 కోట్లకుగానూ రూ.3.13 కోట్లు ఆదాయం 64.30 శాతం వచ్చింది. కళ్యాణదుర్గం పురపాలక సంఘం పరిధిలో రూ.5.70 కోట్లకుగానూ రూ.3.05 కోట్లు , 53.50 శాతం ఆస్తి పన్ను వసూలైంది. పామిడి పురపాలక సంఘంలో రూ.3.93 కోట్లకుగానూ 0.01 కోట్లు అంటే 0.10 శాతమే వసూలైంది. మొత్తంగా చూసినప్పుడు 73.44 శాతం వసూలైంది. అంతకు మునుపు ఏడాది రూ.54.52 కోట్లు అయింది. ఈసారి అంతకు మించి అధికంగా ఆదాయపు పన్ను వసూలైంది.

నగర పాలక సంస్థల్లో 'అనంత'లో మూడవ స్థానం

నగర పాలక సంస్థల్లో చూసినప్పుడు అనంతపురం నగర పాలక సంస్థ రాష్ట్రంలోనే ఆదాయపు పన్ను వసూళ్లలో మూడవ స్థానంలో నిలిచింది. మొత్తం 17 నగర పాలక సంస్థలున్నాయి ఇందులో తాడేపల్లి మొదటి స్థానంలో 82.20 శాతం ఉండగా, కర్నూలు రెండవ స్థానం 81.60 శాతం, ఆ తరువాత అనంతపురం నగర పాలక సంస్థ 80.60 శాతం కలిపి మొత్తంలో నిలిచింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.34.33 కోట్లు మాత్రమే అనంతపురం నగర పాలక సంస్థకు ఆదాయం వచ్చింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి వచ్చే సరికి రూ.48.43 కోట్లు ఆదాయం వచ్చింది. అంటే గతేడాది కంటే 41.10 శాతం అధికంగా ఆస్తి పన్నును పురపాలకవాసులు చెల్లించారు.

బాధిత రైతు కుటుంబానికి పరామర్శ

మృతుని కూతుళ్ల విద్యాభ్యాసానికి దత్తత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కూడేరు మండలం కలగల్ల గ్రామంలో దళిత మీనుగ సంజీవ అనే రైతు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుటుంబ సభ్యులను అనంతపురం జిల్లా మాజీ సైనికుల సంఘం గౌరవ అధ్యక్షులు వీకే.రంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంజీవ వ్యవసాయంలో టమోటా, మిర్చి, వేరుశనగ లాంటి పంటలు సాగు చేసేవాడని, ఇందులో గిట్టుబాటు ధర రాక వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడ్డాడని తెలిపారు. చిన్న వయసులోనే మానసికంగా కంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. ఇతనికి పది సంవత్సరాల లోపు ఇద్దరు కూతుళ్లు ఉన్నారన్నారు. మృతుని ఐదు సంవత్సరాల పెద్ద కూతురి విద్యాపరమైన దత్తతను వికె.రంగారెడ్డి తీసుకున్నారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి జరిగినట్లు భవిష్యత్తులో ఇతర రైతులకు ఇలాంటి సంఘటనలు జరగకుండా గ్రామస్థాయిలో అధికారులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. తన వంతుగా మృతుని రెండవ కూతురుని పదవ తరగతి వరకు చదివించడానికి దత్తత తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతపురం జిల్లా మాజీ సైనిక సంఘం అధ్యక్షులు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి విరాళాలు అందజేయాల్సిన దాతలు "మీనుగ శాంతమ్మ, SBI BANK ACCOUNT NUMBER 20432629256లో జమచేయాలన్నారు. ఫోన్‌పే ద్వారా సాయం చేయాల్సిన వారు 93476 71796కు నగదు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా మాజీ సైనికుల సంఘ ప్రధాన కార్యదర్శి కెప్టెన్ ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి కలగల్ల సిపిఎం నాయకులు చంద్రాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ సైనికుల సంఘం నాయకులు

ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా..?

◆ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల సస్పెన్షన్ అన్యాయం ◆ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించిన విద్యార్థులను సెంట్రల్ యూనివర్శిటీ యాజమాన్యం సస్పెండ్ చేయడం అన్యాయంగా ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ పేర్కొన్నారు. విద్యార్థుల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థుల సస్పెన్షన్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీకి జంతులూరు దగ్గర కేటాయించిన స్థలంలో కాంపౌండ్ వాల్ నిర్మించలేని స్థితిలో బిజెపి ప్రభుత్వం ఉందన్నారు. విద్యార్థులు ఇప్పటికీ అద్దె భవనంలో ఉంటూ అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దౌర్భాగ్యమైన పరిస్థితి అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో ఏర్పడిందన్నారు. ఇక్కడ 21 రాష్ట్రాల నుంచి విద్యార్థులు వచ్చి విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. మంచినీరు, మంచి భోజనం, మౌలిక సదుపాయాలు కల్పించడంలో యూనివర్సిటీ అధికారులు, బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. యూనివర్సిటీలో విద్యార్థులు తినేటువంటి భోజనంలో అనేకసార్లు పురుగులు రావడం అదే విధంగా కనీసం మంచినీరు లేకపోవడం టాయిలెట్ సదుపాయం కూడా లేదన్నారు. ఈ సమస్యలపై అనేక సార్లు విసి, వర్శిటీ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి పోరాటాలు చేసిన ఏమాత్రం స్పందించని దుస్థితి నెలకొందన్నారు. యూనివర్సిటీ సంబంధించినటువంటి కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినర్‌లలో అనేకమైన సమస్యలు ఉన్నాయని విసి చెప్పినప్పటికీ విసి స్పందించడం లేదన్నారు. కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినర్ చేసినటువంటి తప్పుల వల్ల అనేక మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని తెలిపారు. యూనివర్సిటీలో జరిగే అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నించే విద్యార్థులను ఉద్దేశ్య పూర్వకంగా సస్పెండ్ చేయడం దౌర్భాగ్యం అన్నారు. ఈ దుర్మార్గమైన విధానాలను యాజమన్యం మానుకోవాలని, విద్యార్థులను సస్పెన్షన్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలక్రిష్ణ, నరసింహారెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి, గౌసియా, రజిత, ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, వినోద్, చంద్ర తదితర నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-పుట్లూరు

అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కడవకల్లు హార్టికల్చర్ అధికారికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పుట్లూరు మండల వ్యాప్తంగా రైతులు పంటలు నష్టపోయారన్నారున. ఈక్రాప్‌తో సంబంధం లేకుండా, నష్టపోయిన పంటల ఆధారంగా జాప్యం లేకుండా రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విటి.రామాంజినేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, రైతు సంఘం మండల కార్యదర్శి జి.వెకటచౌదరి, నాయకులు నాగభూషణం, రైతులు పుల్లన్న, పెద్దయ్య, నాగమునేద్ర పాల్గొన్నారు.

పరామర్శించడానికి వెళ్తే అరెస్టులా..!

ప్రజాశక్తి-రాయదుర్గం

గుమ్మగట్ట మండలంలోని గోనబావి గ్రామంలో రెండు రోజుల క్రితం మహిళలపై దాడులు జరిగాయని, బాధిత కుటుంబాలను పరామర్శించడానికి వెళ్తుంటే పోలీసుల అక్రమ అరెస్టులు చేయడం దారుణమని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి మురళి పేర్కొన్నారు. శనివారం గుమ్మగట్టకు వెళ్లకుండా మురళిని ఇంటి వద్దకు వెళ్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు 151 సిఆర్‌పిసి సెక్షన్ మేరకు ఇంటి వద్ద వచ్చి ముందస్తు నోటీసులు ఇచ్చారన్నారు. నోటీసులను తీసుకోకపోవడంతో తనను అరెస్టు చేసినట్లు తెలిపారు. గోనబావి గ్రామంలో వాల్మీకి సోదరుల దాడిలో తీవ్రంగా గాయపడిన వారిని పరమర్శించడానికి వెళ్లకుండా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గాయపడిన వారిని పరామర్శించడానికి కూడా అనుమతి ఎందుకు ఇవ్వలేదన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు, సామాజిక మాధ్యమాల ద్వారా రెచ్చ గొట్టిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయండి

ఉరవకొండ : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఎండగట్టి ప్రజలను చైతన్య పరచడానికి టిడిపి నాయకులు నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్రను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. ఉరవకొండలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. 5వ తేదీ ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలంలోకి ప్రవేశించే పాదయాత్రను జయప్రదం చేయాలన్నారు.

భూముల రీసర్వేతో ప్రజలకు ఉపయోగం

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన భూముల రీ సర్వేతో ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని పులిప్రొద్దుటూరు గ్రామంలో లబ్దిదారులకు జగనన్న శాశ్వత భూ హక్కు పథకం కింద మంజూరైన భూ హక్కుపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో భూ సమస్యలు రాకుండా, ఎవరూ భూ యజమానులకు సంబంధించిన భూములను టాంపరింగ్ చేయకుండా ఉండేలా ప్రభుత్వం రీసర్వే చేపడుతోందన్నారు. అలా రీ సర్వే అనంతరం ఆయా భూముల యజమానులకు శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కింద పత్రాన్ని అందజేస్తోందన్నారు. ఇలాంటి సాహసోపేత చర్యల వల్ల భవిష్యత్తులో ముందు తరాల వారికి సైతం భూ సమస్యలు తలెత్తకుండా ఉండడంతో పాటు సమస్యలు లేకుండా పరిష్కారానికి తగిన వీలు ఉండే అవకాశం ఉందన్నారు. తాడిపత్రి మండలంలోని పులిప్రొద్దుటూరు గ్రామంలో భూ రీసర్వే పూర్తయిందని, అందులో భాగంగా ఇప్పటి వరకు దాదాపు 300 మంది వరకు జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద హక్కు పత్రాలు మంజూరు అయ్యాయన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అనంతరం అధికారులతో కలిసి లబ్ధిదారులకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మునివేలు, ఎంపీడీవో రంగారావు, సర్పంచి హనుమంతరెడ్డి, ఎంపీటీసీ గంగిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, రాజారెడ్డి, వెంకటరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలనుఅందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

దళిత మహిళా సమాఖ్య అధ్యక్షురాలిపై వివక్ష

ఆరు నెలలుగా కార్యాలయంలో కుర్చీ ఏర్పాటు చేయని ఎపిఎం

కుందుర్పి : దళితుల పట్ల వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉంది. ఐకెపి దళిత మహిళా సమాఖ్య అధ్యక్షురాలికి కుందుర్పి మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయం కూర్చోడానికి కనీసం కుర్చీ కూడా కేటాయించకపోవడం దీనికి అద్దంపడుతోంది. అధికార పార్టీకి చెందిన మహిళా సమాఖ్య అధ్యక్షురాలికి కూర్చోడానికి కుర్చీ కేటాయించకపోవడంపై దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి నియోజకవర్గంలోనే దళితులపై వివక్ష కొనసాగడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళిత మహిళ కావడం వల్లే ఐకెపి అధికారులు చిన్న చూపు చూస్తున్నారని పేర్కొంటున్నారు. మండల ఐకెపి కార్యాలయంలో ఆర్థిక లావాదేవీల విషయంలో దళిత మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సహకరించడం లేదన్న కక్షతోనే ఎపిఎం ఇలా ప్రవర్తిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి ఐకెపి దళిత మహిళా అధ్యక్షురాలికి గుర్తింపు కల్పించేలా చర్యలు చేపట్టాలని వైసిపి దళిత నాయకులు కోరుతున్నారు.

నడిమివంక ఆక్రమణలపై సమగ్ర సర్వే చేపట్టండి

మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

నగరంలోని నడిమివంక ఆక్రమణలపై సమగ్ర సర్వే చేపట్టాలని అధికారులకు నగర మేయర్ మొహమ్మద్ వసీం సూచించారు. నగరంలోని నడిమివంక సర్వే నెంబర్ 125లో ఆక్రమణలపై కార్పొరేటర్ శ్రీనివాసులు ఇటీవల కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మేయర్ ఆక్రమణలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వేయర్‌తో కలిసి అత్యాధునిక రోవర్ సహాయంతో సర్వే చేపట్టారు. సర్వే జరుగుతున్న తీరును మేయర్ పరిశీలించారు. నడిమి వంక ఆక్రమణల వల్ల ఇటీవల భారీగా వర్షపు నీరు నగరంలోని పలు కాలనీలకు ముంచెత్తిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని నగర అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, అనిల్ కుమార్ రెడ్డి, సర్వేయర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పర్ భద్రతో రాయలసీమకు అన్యాయం

◆ రాష్ట్రాల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపి

◆ రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కర్నాటక రాష్ట్రంలో అప్పర్ భద్రా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే ఏపీలో రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు జీవనాడి అయిన పోలవరం జాతీయ ప్రాజెక్టును పూర్తి నీటి సామర్థ్యంతో నిర్మించాలని కర్ణాటకలో బిజెపి ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న అప్పర్ భద్రా ప్రాజెక్టును ఆపాలని జిల్లా కేంద్రంలోని కమ్మ భవన్ లో అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు,మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దాదా గాంధీ, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల లబ్ధికోసమే అప్పర్ భద్ర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును అక్రమంగా నిర్మిస్తున్నారని ఏకరువు పెట్టారు. ప్రాజెక్టు నిర్మాణానికి సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతులు సైతం లేవని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారేగాని నిధులు ఏమాత్రం మంజూరు చేయడం లేదని దుయ్యబట్టారు. రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టేలా కేంద్రం నిర్ణయాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులను గాలికి వదిలేసిందన్నారు. ఇప్పటికైనా బిజెపి తన విధానాలు మార్చుకుని రాయలసీమ ప్రాంత ప్రయోజనాలను కాపాడే చర్యలు తీసుకోవాలన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

చలివేంద్రం ఏర్పాటు

గుంతకల్లు : పట్టణంలోని 60 అడుగుల రోడ్డు వద్ద సిఐటియు అనుబంధ లగేజ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రెండవ పట్టణ సిఐ గణేష్ శనివారం ప్రారంభించారు. సిఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్స్ క్రమశిక్షణ కలిగి ఉండాలని, లైసెన్స్ తీసుకోవాలని, యూనిఫామ్ ధరించాలని సూచించారు. లైసెన్సులు లేనివారికి ఆర్టీవోతో మాట్లాడి ఇప్పిస్తామని తెలిపారు. వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చడానికి ఆటో డ్రైవర్లు చలి వేంద్రం ఏర్పాటు చేయడం ప్రశంసనీయం అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు డి.శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, నాయకులు లోకేష్, సుంకన్న, ధను, ఆనంద్, భరత్, రమాంజి, రమేష్, వెంకీ, రాజేష్ పాల్గొన్నారు.

ఎండియు ఆపరేటర్ల ధర్నా

గుంతకల్లు రూరల్ : ఎండియు ఆపరేటర్ల ఖాతా నుండి గత నెలలో రూ.23 వేల రూపాయలను ప్రభుత్వ ఖాతాకు మళ్లించడాన్ని నిరసిస్తూ తహశీల్దారు కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. ఒక్కో ఆపరేటర్ ఖాతా నుండి అంత మొత్తం ప్రభుత్వం తమ ఖాతాలో నుంచి తీసుకుంటే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన తహశీల్దారు రాము ఎండియు ఆపరేటర్లను సమావేశపరిచి మాట్లాడారు. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందని, ఇక్కడ మాత్రమే విధులు బహిష్కరించి ధర్నా చేయడం సరికాదన్నారు. ఆదివారం నుంచి రేషన్ పంపిణీ యథావిధిగా కొన సాగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE: DHONE.
O.S.No. 648/2022.
P.Hussen Saheb, aged about 63 years S/O P.Dasthagiri, Muslim, Retired employee, R/O H/NO 3/92/11/1, Teachers colony, Dhone town. Kurnool District. .... PLAINTIFF
V/S
1.K.Sundar Raju, aged about 42 years, S/o K.Kakani, Hindu, working as technician-3 S.S.E(DSL) Railway Diesel Shed, Guntakal R.S. R/O H.NO 4/149/169/3, up stair, Opp lakshmalah Kirana shop, near Geethanjali Grammar School Teachers Colony, Dhone town and Mandal, Kurnool district.
2. Chakali lakshmana Swamy, aged about 32 years, S/o C Venkateswarlu, Hindu, working as Kalashi SSE (DSL) Gooty RS, Anantapur district. ... DEFENDANTS
2వ ప్రతివాదికి సమను ప్రకటన
పై నంబరు దావాలో వాది ప్రతివాదులు అయిన మీ పైన పై కోర్టు నందు దావా దాఖలు చేసినారు. ఇందులో రెండవ ప్రతివాది అయిన మీకు సమన్లు ఇవ్వమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పై దావా నందు మీకు ఏమైనా ఆక్షేపణలు వున్నయెడల 24-04-2023 వ తేదిన ఉదయం 10-30 గంటలకు పై కోర్టు నందు మీరుకాని మీ తరుపున న్యాయవాది కాని పై కోర్టు నందు హాజరు కావలెయును లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని తెలియ చేయడం అయినది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది : 24-04-2023
G. Madhusudhana Rao
Advocates for the Plaintiff,
Dhone, Nandyal Dist. Cell : 9441733503

In the Court of the Hon'ble Ist Addl. Junior Civil Judge -cum- Ist Addl. Judicial Fist Class Megistrate: Anantapuramu
O.S.No.1040/2021
Between:
Chinthaguntla Narayana ...Plaintiff
And
PURE WINN AGRO PVT LIMITED AND PEOPLES Grand Mart Limited, rep.by its Represented by its Managing Director MC.Ravi ...Defendant
Notice to Defendant
PURE WINN AGRO PVT LIMITED rep.by its Managing Director MC.Ravi S/o Late M.C. Chengappa, "Peoples Grand Mart" under the caption of "Pure Organic Products Available" D.No.6-2-423-4, Vs Enclave, NH Bypass Road, Anantapuram. Native of Gangavaram, Palamaneru Mandal, Chittoor Dist.
ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా ప్రతివాది హాజరు నిమిత్తం పై కోర్టు నందు 11-05-2023వ తేది వాయిదా ఉన్నది. కావున పై తేది రోజు ఉదయం 10.30 గం॥లకు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు నందు తెలుపుకొనవలెను. లేనియెడల కోర్టువారు మీ పరోక్షమందు తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
L.PRABHAKAR REDDY, Advocate
Anantapuramu.

In the Court of the Hon'ble Ist Addl. Junior Civil Judge -cum- Ist Addl. Judicial Fist Class Megistrate: Anantapuramu
O.S.No.1036/2021
Between:
Y.Venkata Subbarayudu S/o Yama Tirupathaiah R/o D.No.29-335-B, Saraswathi Nagar, Nandyala Kurnool Dist. ...Plaintiff
And
Purewinn Agro PLt and Peoples Grand Mart rep.by its Managing Director M.C.Ravi S/o M.C. Changappa. ...Defendant
NOTICE TO DEFENDANT
Purewinn Agro PLt rep.by its Managing Director M.C.Ravi S/o Changappa, Business "Peoples Grand Mart" under the caption of Pure Organi Products Available D.No.6-2-423-4, NH, Bypass Road, Anantapuramu, Native of Gangavaram, Palamanru Mandal, Chittoor Dist.
ఇందుమూలముగా తెలియజేయడమేమనగా ప్రతివాది హాజరు నిమిత్తం పై కోర్టు నందు 08-05-2023వ తేది వాయిదా ఉన్నది. కావున పై తేదీ రోజు ఉదయం 10.30 గం॥లకు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏవైన ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు నందు తెలుపుకొనవలెను. లేనియెడల కోర్టువారు మీ పరోక్షమందు తీర్మానించెదరు.
(By Order of the Court)
L.PRABHAKAR REDDY, Advocate
Anantapuramu.

In the Court of the Senior Civil Judge:Penukonda
I.A.53/2022 I.A.54/2022 I.A.55/2022 in O.S.199/2014
Between:
S.Narasimha Reddy and others ...Petitioners/Plaintiffs
And
S.Nagalakshmamma and others ...Respondants/Defendants
పై నెంబరు దావాలోని I.A.53/22, I.A.54/22, I.A.55/22, లోని 12వ ప్రతివాదికి నోటీసులు
To,
R12: Sobha W/o Vara Prasad Reddy, Kattakindapalli, Rapthadu Mandalam.
ఇందుమూలకముగా నీకు తెలియచేయడమేమనగా పై నెంబరు దావాలోని 3వ వాది ఎస్.వెంకటరెడ్డి వారసులుగా మిమ్ములను చేర్చుటకు గాను పై నెంబరు అర్జీలను దాఖలు చేసినారు. సదరి విషయముల్లై నీకు ఏమైనా ఆక్షేపణలు వున్న ఎడల నీవు 04-04-2023వ తేదిన ఉదయం 10.30 గంటలకు ఖుద్దున గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై నీ వాదనను కోర్టువారికి తెలుపుకొనవలెను. లేనియెడల నీ పరోక్షమందు పై అర్జీని తీర్మానం చేయుదురని ఇందుమూలకముగా నీకు తెలియచేయమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
ఆర్.శ్రీకాంత్‌రెడ్డి
వాదులపరం వకీలు, పెనుకొండ.

వేడెక్కుతున్న రాజకీయాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వేసవికాలం కావడంతో ఎండల వేడి పెరుగుతోంది. ఇదే సమయంలో రాజకీయ వాతావరణమూ వేడెక్కుతోంది. ముందస్తు ఎన్నికలు కూడా రావచ్చునని ఊహాగానాలు మొదలైన నేపథ్యంలో రాజకీయ నాయకులు చురుకయ్యారు. తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పాదయాత్ర కూడా జిల్లాలో కొనసాగుతోంది. ఈ పర్యటన సమయంలో ఆయన ప్రస్తావిస్తున్న స్థానిక సమస్యలతో అధికార పార్టీ నాయకులు వీటిపై ఘాటుగా స్పందిస్తున్నారు. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం తారా స్థాయికి చేరుతోంది. సవాళ్లు, ప్రతిసవాళ్లు పెరిగిపోతున్నాయి. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కుతోంది. యువగళం పాదయాత్ర అనంతరం పుట్టపర్తిలో అధికార ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలు రెండు రోజులుగా విసురుకున్న సవాళ్లు మంగళవారానికి తారా స్థాయికి చేరాయి. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే పుట్టపర్తిలో ఈసారి మాత్రం ఉద్రిక్తతలకు దారితీసే విధంగా సాగింది. బహిరంగ చర్చకు రెండు వైపుల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు మోహరించడం, పరస్పరం చెప్పులు విసురుకోవడం, టెంకాయలు విసురుకున్నారు. దీంతో పుట్టపర్తిలో హైటెన్షన్ వాతావరణమే నెలకొంది. ఇక రాప్తాడులోనూ అదే పరిస్థితి నెలకొంది. జాకీ పరిశ్రమ పోవడానికి అధికారపార్టీ నాయకులే కారణమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన పాదయాత్ర సందర్భంగా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో వైసిపి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి వారిపై తీవ్ర స్థాయిలోనే విమర్శలు చేశారు. ఇద్దరి మధ్య ఇప్పటికీ మాటల యుద్ధమే సాగుతోంది. మంగళవారం నుంచి లోకేశ్ పాదయాత్ర ధర్మవరంలో ప్రవేశించింది. ఇక్కడా కూడా అధికార, ప్రతిపక్ష పార్టీ మధ్య మాటల యుద్ధం పెరిగే అవకాశముంది. ఎన్నికల ముందు రెండు పార్టీల మధ్య మాటల యుద్ధంతోపాటు నేరుగా ఘర్షణలకు సైతం దిగే పరిస్థితులు నెలకొంటున్నాయి. వీటిని అదుపు చేయడం పోలీసులకు సైతం తలకు మించి భారమే అవుతోంది. జరుగుతున్న పరిణామాలు ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తున్నాయి. త్వరలోనే ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయని జరుగుతున్న ప్రచారంతో రాజకీయ నాయకులు సైతం యాక్టివ్ అవుతున్నారు. ఏప్రిల్ మూడవ తేదీన మంత్రివర్గ సమావేశం అనంతరం ఒక స్పష్టత వస్తుందని రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. దీంతో ఎన్నికల బరిలో దిగే నేతలంతా ప్రజల్లోకి వెళ్లేందుకు అవసరమైన సన్నాహకాలకు సిద్ధమవుతున్నారు. టిక్కెట్లు ఎవరికి

వస్తాయి, ఎవరికి రావన్న అంశాలు కూడా రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రజలకు చేరవయ్యేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించుకుంటున్నారు. అదే సమయంలో అధిష్టానం కంట్లో పడేందుకు మార్గాలను అన్వేషించుకుంటున్నారు. ఆయా రాజకీయ పార్టీలు కూడా అభ్యర్థుల పరిస్థితులపై సర్వేలను సైతం చేస్తున్నారు. గెలుపు గుర్రాల కోసం అన్వేషణ చేపడుతున్నాయి. బలాబలాలను బేరీజు వేసుకునే పనిలో పడ్డాయి. దీంతో మొత్తంగానే రాజకీయ హడావుడి అప్పుడే మొదలైంది. జిల్లాలో ఇప్పటి వరకు కప్పదాట్లు మొదలవలేదు. ఇకపై మొదలయ్యే అవకాశాలూ లేకపోలేదన్న చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది. ఎన్నికల బరిలో దిగే ఆలోచనున్న వారు ఇక నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధపడుతున్నారు.

ఒలంపియాడ్‌లో 'శ్రీ చైతన్య' విద్యార్థుల విజయభేరి

ప్రతిభ కనబరచిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

ఐఎన్‌టిఎస్ఒ ఒలంపియాడ్ రెండవ లెవెల్లో అనంతపురం జోన్‌కి చెందిన శ్రీ చైతన్య విద్యార్థులు అత్యధిక గ్రాండ్ ప్రైజ్‌లు, గోల్డ్ మెడల్స్, కాంసోలేషన్ బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్స్ సొంతం చేసుకున్నారని ఏజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కమ్మభవన్ సమీపంలోని శ్రీ చైతన్య స్కూల్ సి అండ్ ఎం క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ఏజిఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకి మిఠాయిలు పంచి అభినందించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ అనంతపురం 1 బ్రాంచ్‌కి చెందిన కె.హేమంత్, వెంకట సాయి (5వ తరగతి), అనంతపురం 5 బ్రాంచ్‌కి చెందిన ప్రణీత్ (8వ తరగతి), అనంతపురం 6కి చెందిన సాయి చరణ్, వర్షిత్, సిబిఎస్‌సి బ్రాంచ్‌కి చెందిన లక్షిత్ (8వ తరగతి), గ్రాండ్ ప్రైజులు గెలుచుకున్నారన్నారు. 13 మంది విద్యార్థులు మొదటి బహుమతి, ముగ్గురు ద్వితీయ బహుమతి, 12 మంది 3వ బహుమతి, 15 మంది 4వ బహుమతి, 29 మంది 5వ బహుమతి, 510 మంది కాంసోలేషన్ బహుమతులను, 71 మంది స్పెషల్ ప్రైజ్‌లు, గోల్డ్ మెడల్, 326 మంది గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్స్, 183 మంది గోల్డ్ మెడల్స్, 2389 మంది మెరిట్ సర్టిఫికెట్స్ మొతంగా 4155 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పటిష్టమైన పాఠ్యప్రణాళిక, అనుభవం కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వడం వల్లనే ఇంతటి ఘనవిజయం సాధ్యం అయిందని అన్నారు. ఈ విజయానికి సహకరించిన తల్లిదండ్రులకి, ఉపాధ్యాయులకు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విశ్వనాథ్, తబుస్సుం, ఖలందర్, షామీనా ఖాన్, పర్వీన్ భాను, వెంకటేష్, నేత్రవతి, శాంత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికురాలి మృతికి మేయర్ సంతాపం

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థ కార్మికురాలు మృతి పట్ల మేయర్ మొహమ్మద్ వసీం సంతాపం వ్యక్తం చేశారు. నగరంలోని 6వ సర్కిల్‌లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ వర్కర్ లక్ష్మీదేవి అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మేయర్ వసీం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తక్షణ సాయంగా మట్టి ఖర్చుల కోసం మృతురాలు కుటుంబీకులకు రూ.15 వేలు ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని అందించి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించారు. మేయర్ వెం ఇన్‌ఛార్జి కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, ఎంహెచ్ఒ గంగాధర్ రెడ్డి, నాయకులు ఖాజా, యూనియన్ నాయకులు ఎటిఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు నాయకుల నివాళి

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ వర్కర్ లక్ష్మీదేవి పార్థివదేహానికి సిఐటియు అనుబంధ మునిసిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారి స్వామి, సాకే తిరుమలేష్, కమిటీ సభ్యులు, ఆదినారాయణ, మిత్ర సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు నల్లప్ప, రాజు, పాల్గొన్నారు.

మృతదేహాన్ని ఇంటి వద్దకు అనుమతించని యజమాని

లక్ష్మీదేవి బాడుగ ఇంట్లో నివాసం ఉంటోంది. ఆమె మరణానంతరం మృతదేహాన్ని ఇంటి వద్దకు తీసుకురావడానికి ఇంటి యజమానులు నిరాకరించారు. దీంతో మృతదేహాన్ని రోడ్డుమీద కారులోనే ఉంచుకుని అంతిమ సంస్కారాలకు తీసుకుపోయారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నగరపాలక సంస్థ కార్మికులు కోరుతున్నారు.

జొన్నల గోదాము పరిశీలన

గుంతకల్లు రూరల్ : గుంతకల్లు పట్టణ శివారులోని ప్రభుత్వ రేషన్ షాపుల ద్వారా ప్రజలకు పంపిణీ చేయడానికి బళ్లారి రోడ్డులోని గోడౌన్ నందు నిలువ చేసిన జొన్నల స్టాక్‌ను జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ శనివారం పరిశీలించారు. నక్కనదొడ్డి గ్రామంలోని ఐఒసి దగ్గర ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకు స్థలాన్ని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దారు బి.రాము, వీఆర్వో విశ్వనాథ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి పాలనలోనే మహిళల అభివృద్ధి

ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పట్టణంలోని క్రీడా మైదానంలో శనివారం మెప్మా, వెలుగు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మూడో విడత ఆసరా పథకానికి సంబంధించిన చెక్కులను పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. లోకేష్ చేపట్టిన పాదయాత్రలో ప్రజలకు మేలు చేస్తామనే హామీలను ఇవ్వకుండా సీఎంను, వైసీపీ నాయకులను దూషిస్తున్నారని చెప్పారు. లోకేష్ వీధి రౌడీలా వ్యవహరిస్తున్నారని అన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు టిడిపి సభల్లో జగన్మోహన్ రెడ్డిని నీ అంతు చూస్తా, నీ కథ చెప్తా అని సంబోధించడం ఎంతవరకు సమంజసమన్నారు. తమ ప్రభుత్వంలో 87 శాతం ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, ఎంపీపీ జి.విశాలాక్షి, వైస్ చైర్‌పర్సన్ లు పద్మలత, వరలక్ష్మి, వైస్ ఎంపీపీలు తిరుపాలమ్మ, నాగేశ్వరమ్మ, వైసిపి సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, పట్టణ మండల కన్వీనర్లు హుస్సేన్ పీరా, గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు క్రసర్ మధుసూదన్ రెడ్డి, బళ్లారి రాజ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు రమేష్ రెడ్డి, రంగస్వామి, ఎంపీడీవో చిట్రా శ్రీనివాసులు, మెప్మా అధికారిణి కెరణ్, వెలుగు ఏపీఎం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎ.నారాయణపురంలో 'గడప గడపకూ' మన ప్రభుత్వం

బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం రూరల్ పరిధిలోని ఎ.నారాయణపురం పంచాయతీ తపోవనం నందు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని ఆయా కుటుంబాలకు ఎమ్మెల్యే వివరించారు. ప్రత్యేక బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా నేరుగా పథకాలను ప్రతి గడపకూ అందిస్తున్నామని తెలియజేశారు. డ్రెయినేజీ, రోడ్డు నిర్మాణాలకు సంబంధించి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా త్వరలోనే పరిష్కార చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, జెడ్పిటిసి చంద్ర, ఎంపీపీ, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఎంపీటీసీ నాగేంద్ర, కార్పొరేటర్ శ్రీనివాసులు, వైసీపీ నేతలు జగన్‌మోహన్‌రెడ్డి, మల్లెల వేణుగోపాల్, బి.మదన్‌మోహన్‌రెడ్డి, హాజీవలి, కృష్ణారెడ్డి, బషీర్,పుల్లారెడ్డి, జాఫర్, రామానుజన్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రమణారెడ్డి, రాధాకృష్ణ, రత్నమయ్య, అనిల్ గౌడ్, భారతి తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : అభివృద్ధి సంక్షేమమే సీఎం జగనన్న లక్ష్యం అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం -3 పరిధిలోని కెవిఎస్ నగర్, వీరభద్ర కాలనీ, ఐలమ్మ కాలనీ, గిరి ప్రసాద్ నగర్, దక్షిణామూర్తి నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దారు మోహన్ కుమార్, ఎంపీడీవో తేజోత్స్న, ఎంపీపీ సునీత, జడ్పీటీసీ భాస్కర్, సర్పంచి పార్వతి, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు పూల నారాయణస్వామి, మానేరు కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

'వాస్తవిక కథల సేద్యగాడు సింగమనేని'

ప్రజాశక్తి-అనంతపురం

వాస్తవిక కథల సేద్యగాడు సింగమనేని అని, అనంత రైతు పక్షాన నిలిచిన గొప్ప సాహితీవేత్త అని, కరువు నేలలో దగా పడుతున్న రైతుల యదార్థ దృశ్యాన్ని తెలుగు సాహితీ లోకానికి అందించిన గొప్ప మేధావి సింగమనేని నారాయణ అని వక్తలు కొనియాడారు. సింగమనేని నారాయణ ద్వితీయ వర్థంతి సందర్భంగా నగరంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగరపాలక ఉన్నత పాఠశాలలో శనివారం సాహితీ సదస్సు నిర్వహించారు. సదస్సుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్‌రావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సింగమనేని కథల నిండా అనంత రైతుల జీవితాలు, మధ్యతరగతి ప్రజల మనస్తత్వాలు, బడుగు బలహీన వర్గాల జీవితాలు ప్రతిబింబిస్తాయని అన్నారు. ప్రతి రచన తన అనుభవంతో రాశాడన్నారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జి.బాలసుబ్రమణ్యం ప్రసంగిస్తూ సింగమనేని నిబద్ధత కలిగిన రచయిత అన్నారు. మార్క్సిజం దృష్టి కోణంతో సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రంగస్వామి ప్రసంగిస్తూ సింగమనేని నారాయణ అనంత ఆణిముత్యమని, తాను చెప్పే సిద్ధాంతాలకు కట్టుబడి జీవించడం, రచనలు చేయడం రెండూ ఒకే సమయంలో చేశారన్నారు. పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మపురి వెంకటేష్ ప్రసంగిస్తూ జూదం, అడుసు, ఒక పయనం, కొత్త అల్లుడు, తరగతి గదిలో తల్లి, లాంటి గొప్ప కథలు ఆయనకు కీర్తి తెచ్చాయన్నారు. జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి హెచ్ నాగలింగయ్య ప్రసంగిస్తూ సింగమనేని జీవితం భవిష్యత్ తరాల వారికి తెలియజేయడానికే ఇలాంటి సాహిత్య సభలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి సింగమనేని కథల పుస్తకాలు బహుమతులుగా అందిస్తున్నామన్నారు. డాక్టర్ నానీల నాగేంద్ర మాట్లాడుతూ సింగమనేని ఆధునిక దృష్టి కోణం గల రచయిత అన్నారు. తెలుగు పండితుడు రామశేషయ్య మాట్లాడుతూ సింగమనేని అనంత సాహిత్యాన్ని భుజాలకి ఎత్తుకొని ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం విద్యార్థులకు సింగమనేని నారాయణ జీవితం సాహిత్యం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు సింగమనేని కథల పుస్తకాలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో మిద్దె మురళీకృష్ణ, సాయప్ప, వేలాంగిని, మధుర శ్రీ, పూజారి ఈరన్న, షేక్ రియాజుద్దీన్ అహ్మద్, టీవీ రెడ్డి, నాగమణి, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



సాహిత్య సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

నేరాలు ఘోరాలు

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

గుత్తి : గుత్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో శనివారం రైలు కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని జిఆర్‌పి ఎస్ఐ నాగప్ప, సిబ్బంది పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జిఆర్‌పి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

గుత్తి : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. సబ్ రిజిస్టర్ కార్యాలయానికి నైట్ వాచ్‌మెన్‌గా పనిచేసే హనుమంతు ఆస్పత్రి వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం

గుత్తి : గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల 22వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల వ్యవస్థాపకులు వీకే.సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం సెమిస్టర్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంగా బహుమతిని, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కర్నూలు నుంచి వచ్చిన మ్యూజిక్ ట్రూఫ్ వారు పాటలతో అలరించారు. కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, ఎమ్‌డి గజ్జల రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ జి.శాంతి, వివిధ విభాగ అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

అనారోగ్యంతో టిడిపి నాయకుడు మృతి

బొమ్మనహాల్ : బొమ్మనహాల్ మండల కేంద్రానికి చెందిన టిడిపి నాయకుడు చెన్నారెడ్డి శనివారం మరణించాడు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో శనివారం ఆయన మరణించాడు. చెన్నారెడ్డి పార్థివదేహానికి వైసిపి నాయకులు ముల్లంగి నారాయణస్వామి, దేనిగిరి సర్పంచి భర్త రాజకుమార్, మాజీ జెడ్పిటిసి జగన్నాథ్ రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ మండల కన్వీనర్ చలపతి, రైతు సంఘం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రహాస్, టిడిపి కన్వీనర్ బలరాం రెడ్డి తదితరులు నివాళి అర్పించారు.

10న వేలంపాటలు

రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలోని రాణి సత్రం ఆవరణలో బండ్లు, వాహనాలను ఉంచుకునేందుకు సంబంధించి టోల్‌గేట్ రుసుము వసూలు చేసుకునేందుకు ఈనెల పదో తేదీన వేలం పాటలు నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ సమూహ దేవాలయం కార్యనిర్వహణాధికారి కె.నరసింహారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే నెల 1వ తేదీ నుండి 2024 ఏప్రిల్ 30వ తేదీ వరకు టోల్‌గేట్ రుసుము వసూలు చేసుకునేందుకు వేలం పాటలు ఈనెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు పట్టణంలోని కోటలో ఉన్న ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు రూ.లక్ష దరరావతు సొమ్ము చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని తెలియజేశారు.

4న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

రాయదుర్గం : ఈనెల 4వ తేదీన రాయదుర్గం నుండి తమిళనాడులోని అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసును నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం నుండి అరుణాచలానికి రానుపోను రూ.1950, కళ్యాణదుర్గం నుండి అరుణాచలానికి రానుపోను రూ.1790 బస్సు టికెట్ ఛార్జీని నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి కలవారు 9959225863, 9490414623, 9704487600 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

3న వాలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలోని ఏడు సచివాలయాల కింద ఖాళీగా ఉన్న 10 వాలంటీర్ల పోస్టులకు ఈనెల 3వ తేది సోమవారం ఇంటర్వ్యూలు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ దివాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత అసలు ధ్రువపత్రాలు, నకళ్లను తమవెంట తీసుకు రావాలని కోరారు.

గుత్తి మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసులు

గుత్తి : గుత్తి నూతన మున్సిపల్ కమిషనర్‌గా జి.శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ ఎఇ శరత్ చంద్ర ఇంతకాలం ఇన్‌ఛార్జి కమిషనర్‌గా వ్యవహరించారు. కర్నూలు జిల్లా గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేస్తున్న జి.శ్రీనివాసులు బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్య పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెడతామని ఈ సందర్భంగా నూతన కమిషనర్ పేర్కొన్నారు. మున్సిపల్ పాలక వర్గంతో చర్చించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కమిషనర్‌ను మున్సిపాలిటీ డిఇ ఇంతియాజ్, ఎఇ శరత్ చంద్ర, టిపిఎస్ అబ్దుల్ సత్తార్, ఆర్ఐ షేక్షావలి, బిల్ కలెక్టర్ చంద్రశేఖర్ వివిధ విభాగాల అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తాడిపత్రి రూరల్ : పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ నాగరాజు తెలిపారు. మండలంలో 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా 2686 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాబోతున్నారని తెలిపారు. 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. 156 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేపట్టామన్నారు.

పెద్దపప్పూరు : పదవ తరగతి పరీక్షలు 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పెద్దపప్పూరు మండల కేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాలను ఎంపిడిఒ రామకృష్ణ, ఎంఇఒ శ్రీదేవి శనివారం పరిశీలించారు. విద్యార్థులు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

నార్పల : పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ కృష్ణయ్య తెలిపారు మండల వ్యాప్తంగా 615 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. స్థానిక బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు సరస్వతీ విద్యా మందిరంలో పరీక్ష సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు.

విలేకరులు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను.
విలేకరులు కావాల్సిన ప్రాంతాలు: అనంతపురం జిల్లా:
1.అనంతపురం అర్బన్ 2.అనంతపురం క్రైం, 3.అనంతపురం రూరల్ 4.కూడేరు 5.రాప్తాడు 6.వజ్రకరూర్ 7.పామిడి 8.కళ్యాణదుర్గం రూరల్ 9.కంబదూరు
శ్రీ సత్యసాయి జిల్లా: 1.హిందూపురం రూరల్ 2.పెనుకొండ రూరల్ 3.ధర్మవరం రూరల్ 4.పుట్టపర్తి కలెక్టరేట్ 5.పుట్టపర్తి క్రైం 6.కొత్తచెరువు రూరల్ 7.ముదిగుబ్బ రూరల్ 8.ఓ.డి. చెరువు రూరల్ 9.తాడిమర్రి 10.రొళ్ల 11.అమడగూరు 12.గోరంట్ల రూరల్.
విద్యార్హత: 10వ తరగతి లేదా ఇంటర్ పాస్/ఫెయిల్
ఇంటర్వ్యూ తేది: 03-04-2023
ఉదయం 10 గంటలకు

అడ్రస్:
పాత విఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్టు గోడౌన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, బళ్లారిరోడ్డు, అనంతపురం.
సెల్: 9490099311, 9490099312.